

మొక్కలను నాటి సంరక్షించాలి


మొక్కనాటి నీరు పోస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

అనంతపురం : ప్రతి ఒక్కరూ తమ అమ్మ పేరుపైన మొక్క నాటి సంరక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలని కేంద్రీయ విద్యాలయ ఎస్కెయు క్యాంపస్ ప్రిన్సిపాల్ మార్కండేయులు పిలుపునిచ్చారు. శనివారం అనంతపురం రూరల్ పరిధిలో ఉన్న కేంద్రీయ విద్యాలయ ఆవరణలో మొక్కలను నాటి నీరు పోశారు. అనంతరం మొక్కలను సంరక్షిస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయసులోనే ఇలాంటి కార్యక్రమం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థిలు, తల్లితండ్రులు పాల్గొన్నారు.


ఇసుక నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

పకడ్బందీగా ఇసుక పంపిణీ

కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి - రాయదుర్గం

అనంతపురం జిల్లాలో పకడ్బందీగా ఇసుక పంపిణీ చేపట్టడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. శనివారం రాయదుర్గం మండలంలోని జుంజురాంపల్లి గ్రామం వద్దనున్న ఇసుక స్టాక్ పాయింట్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇసుక పంపిణీకి సంబంధించి ఎలాంటి ఇబ్బందులు రాలేదన్నారు. జిల్లాలో ఉన్న ఒకే ఒక స్టాక్ యార్డు జుంజురాంపల్లి స్టాక్ యార్డు అని ఇక్కడ దాదాపు 58,160 మెట్రిక్ టన్నుల ఇసుక నిలువ చేసే అవకాశం ఉందన్నారు. ఇప్పటివరకు 16,226 మెట్రిక్ టన్నుల ఇసుక పంపిణీ చేయగా, స్టాక్ యార్డులో 41,934 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉందని అన్నారు. ఉచిత ఇసుక కార్యక్రమం కింద ఇసుక రీచ్ నుంచి డిపో వరకు ఇసుకను తేవడం, లోడింగ్ చార్జీలు, రాయల్టీ (సీనరేజ్) ఛార్జీలు మొత్తం కలిపి ఒక మెట్రిక్ టన్ను ఇసుకను 195 రూపాయలకు అందిస్తున్నామన్నారు. ఇసుక పంపిణీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే అందుబాటులో ఉందని అన్నారు. ఇంటర్ స్టేట్‌కు అందుబాటులో ఉండదన్నారు. అన్ని శాఖల అధికారులు, పోలీస్ శాఖ, జల వనరులు, రెవెన్యూ కలిసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇసుక పంపిణీ చేపట్టడం జరుగుతోందని తెలిపారు. ఇసుక సరఫరాకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా మైన్స్ అధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. జిల్లాలో ఇంటి నిర్మాణానికి ఇసుకను ఉపయోగించడం జరుగుతోందని, ఇక్కడి నుంచి కర్నూలు జిల్లాలోని పత్తికొండ, శ్రీ సత్య సాయి జిల్లాలోని అమరాపురం వారు ఇసుకను తీసుకెళుతున్నారని చెప్పారు. జిల్లాలో స్టాక్ యార్డులను, కొత్తగా ప్రతిపాదనలు పంపించిన ఇసుక రీచ్ లను తనిఖీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇసుక స్టాక్ నమోదు చేసే రికార్డులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. స్టాక్ పాయింట్ నుంచి ఎక్కడెక్కడ వరకు ఇసుక సరఫరా చేస్తున్నారు, ఎంత బాడుగ వసూలు చేస్తున్నారు, ఇసుక నాణ్యతగా ఉందా, ప్రతిరోజు ఎన్ని లోడ్‌లను పంపిస్తున్నారు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ రావు, భూగర్భ గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగయ్య, రాయదుర్గం పోలీస్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులు, తహశీల్దార్ చిట్టిబాబు, మండల వ్యవసాయ అధికారి మహేంద్ర, పంచాయతీ కార్యదర్శి అశోక్ కుమార్, గ్రామ రెవెన్యూ అధికారి భీమప్ప, సర్పంచి వన్నూరు స్వామి తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎల్‌సి ద్వారా సజావుగా నీటి సరఫరాకు చర్యలు

ఎలాంటి ఇబ్బంది లేకుండా హెచ్ఎల్‌సి ద్వారా నీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం కనేకల్ మండల కేంద్రం వద్దనున్న చిక్కణ్ణేశ్వర చెరువును జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుంగభద్ర డ్యామ్ నుంచి హెచ్ఎల్‌సి ద్వారా విడుదల చేసిన జలాలు పిఎబిఆర్ డ్యామ్‌కు చేరుతున్నాయన్నారు. జిల్లాలో ఆగస్టు రెండో వారంలో జిల్లా ఇరిగేషన్ కన్సల్టేషన్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని శాసనసభ్యులతో మాట్లాడి సమావేశం ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈసారి జిల్లాకు హెచ్ఎల్‌సి నీటి రాకలో ఎలాంటి ఇబ్బంది ఉండదని అన్నారు. కర్నాటకలోనిఅగుంబే, శివమొగ్గ, ధావనగెరె, బళ్లారి ప్రాంతాల్లో వర్షాలు బాగా పడడం వల్ల తుంగభద్ర డ్యాం నిండిందన్నారు. డ్యాం నిండడంతో జిల్లాకు కేటాయించిన 26 టిఎంసిల జలాలు వస్తాయనే అనుకూల భావంతో ఉన్నామన్నారు. జిల్లాలో హెచ్ఎల్‌సి కింద ఉన్న 1.4 లక్షల ఎకరాలకు, వీలైతే కర్నూలు జిల్లాలో ఉన్న 20 వేల ఎకరాలకు నీరు ఇవ్వగలుగుతామని ఇంజనీర్లు తెలియజేశారన్నారు. నీటి సరఫరాలో ఎక్కడ ఇబ్బంది లేకుండా అప్పుడప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయడం జరుగుతుందన్నారు. తాగునీటి కోసం ఎక్కడైనా డిమాండ్ ఉంటే దానిని గుర్తించి తమ దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎల్‌సి ఎస్ఇ రాజశేఖర్, డిఇఇ మద్దిలేటి, ఇఇ రమణారెడ్డి, ఎఇఇ అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.


హెచ్ఎల్‌సిలో నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, తదితరులు

వేధింపులు తాళలేక ...

అంగన్వాడీ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

నిందితుడిని అరెస్టు చేయాలంటూ సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా


పురుగుల మందు బాటిల్ పట్టుకుని సెల్ఫీ విడియోలో మాట్లాడుతున్న అంగన్వాడీ కార్యకర్త నాగమణి

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు, కదిరి టౌన్

శ్రీసత్యసాయి జిల్లా ఓబుళదేరవచెరువు మండల పరిధిలోని వీరప్పగారి పల్లికి చెందిన మినీ అంగనవాడీ వర్కర్ నాగమణి అదేగ్రామానికి చెందిన కొందరి వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అదే గ్రామానికి చెందిన ఆంజనేయులు, కొంతమంది వ్యతిరేకవర్గం వారు తన అంగనవాడీ టీచర్ పోస్టు తొలగిస్తామని బెదిరిస్తూ తనపై లేని పోని ఆరోపణలు చేస్తూ వేధింపులకు గురి చేస్తున్నారని శనివారం అంగన్వాడీ సెంటర్‌లోనే సెల్ఫీ వీడియో రికార్డు చేసి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించి కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈఘటనకు సంబందించి బాధితురాలు, స్థానికులు తెలిపిన వివరాలు...

వీరప్పగారిపల్లికి చెందిన నాగమణి మూడు సంవత్సరాల క్రితం వైసీపీ ప్రభుత్వ హయాంలో అంగన్వాడీ కార్యకర్తగా విధుల్లో చేరింది. అప్పటినుంచి అంగన్వాడీకార్యకర్తగా కొనసాగుతోంది. అయితే ఇటీవల టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో గ్రామానికి చెందిన కొంతమంది నాగమణి కుటుంబానికి వ్యతిరేకంగా ఉన్నవారు నాగమణిని అంగన్వాడీ పోస్టు నుంచి తప్పించాలని రాజకీయంగా ప్రయత్నాలు ప్రారంభించారు. నాగమణిని, ఆమె కుటుంబాన్ని మానసికంగా వేధింపులకు గురి చేశారు. ఉద్యోగం నుంచి తొలగింపజేస్తామని పదేపదే ప్రచారం చేశారు. దీంతో నాగమణి మనస్థాపానికి గురైంది. శనివారం అంగన్వాడీ సెంటర్‌లోనే సెల్ఫీ విడియో రికార్డు చేసి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయానికి పాల్పడింది. గమనించిన చుట్టుపక్కల వారు నాగమణిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం నాగమణి పరిస్థితి నిలకడగా ఉందని డాక్టర్లు తెలిపారు.

నిందితులను అరెస్టు చేయాలంటూ సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా

కొండకమర్ల సెక్టరు పరిధిలోని వీరప్పగారిపల్లి మినీ అంగన్వాడీ వర్కర్ ఆత్మహత్యాయత్నానికి కారణమైన టిడిపి నాయకులు ఆంజనేయులు, తదితరులను వెంటనే అరెస్టు చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, కో కన్వీనర్ శ్రీరాములు, మండల కన్వీనర్ కుళ్లాయప్ప, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాబున్నీసా, ప్రాజెక్టు కార్యదర్శి రంగమ్మ, మణి మాల, ఆశీర్వాదమ్మ, కిష్టమ్మ, ఆదిలక్ష్మి, షమీం, వరలక్ష్మి, స్వర్ణ, తదితరులు ఓడిసి తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్త నాగమణిని అదే గ్రామానికి చెందిన టిడిపి నాయకులు ఆంజనేయులు, అతని బంధువులు అసభ్య పదజాలంతో దూషిస్తూ వేధింపులకు గురి చేశారన్నారు. ఆ అవమానాలను భరించలేక నాగమణి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు. ఇందుకు కారణమైన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ ఖాజాబీకి అందజేశారు. ఆ తరువాత తహశీల్దార్ కార్యాలయం నుండి ర్యాలీగా పోలీస్ స్టేషన్ వెళ్లి సిఐ రాజేంద్ర నాథ్, ఎస్ఐ వంశీకృష్ణకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు జయమ్మ, కళావతి, అఖిల, చంద్రకళ, మంజుల, వెంకట నరసమ్మ, సుకన్య ,భారతి, శ్యామల ,పార్వతమ్మ, సునంద, విజయమ్మ, సుహాసిని, సునీత భాయ్, సుహాసిని, సుజాత, రమణమ్మ, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శించిన సిఐటియు నాయకులు : ఓడిసి మండలం వీరప్ప గారి పలికి చెందిన అంగనవాడీ సెంటర్ మినీ కార్యకర్త నాగమణి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి కదిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా విషయం తెలుసుకున్న సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు జిఎల్ నరసింహులు బాధితురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా జిఎల్ నరసింహులు మాట్లాడుతూ గ్రామానికి చెందిన టిడిపి నాయకులు నాగమణినిని ఎలాగైనా పోస్ట్ నుంచి తొలగించాలని రాజకీయంగా పలుకుబడి ఉపయోగించి ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చారన్నారు. వారి ఒత్తిళ్లకు తలొగ్గిన పీడీ ఇటీవల విచారణ చేపట్టారన్నారు. పీడీ సూచన మేరకు సీడీపీవో వరలక్ష్మి ఆధ్వర్యంలో సెంటర్‌ను మరో చోటకు మార్చుతున్న నేపథ్యంలో అంగన్వాడీ కార్యకర్త నాగమణి టిడిపి నాయకుల వేధింపులు భరించలేక ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టిందన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా అంగన్వాడీ కార్యకర్తలను రాజకీయంగా వేధించడం, భయభ్రాంతులకు గురిచేయడం సరైన పద్దతి కాదన్నారు. ఐసిడిఎస్ అధికారులు కూడా అధికార పార్టీ నాయకుల ఒత్తిడికి తలొగ్గి అంగన్వాడీ కార్యకర్తలను వేధించడం సరైంది కాదన్నారు. ఇలాంటి వేధింపులు మానుకోకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ నాయకులు లక్ష్మీదేవి, భాగ్యమ్మ, సుజాత, మోక్ష, వెంకటలక్ష్మి, సిఐటియు నాయకులు జగన్మోహన్, బాబ్ జాన్ తదితరులు పాల్గొన్నారు. కదిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అంగన్వాడీ కార్యకర్త నాగమణిని సిడిపిఒ వరలక్ష్మి పరామర్శించారు. బాధితురాలి కుటుంబసభ్యులతో మాట్లాడారు.

పీడీ నిర్లక్ష్య ధోరణి : మినీ అంగన్వాడీ కార్యకర్త నాగమణి ఆత్మహత్యయత్నానికి పాల్పడి చావు బతుకుల మధ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఐసిడిఎస్ ఇన్‌చార్జి పీడీ నాగమల్లేశ్వరి నిర్లక్ష్య ధోరణి అవలంబించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంగన్వాడీ కార్యకర్త ఆత్మహత్యాయత్నంపై విలేకరులు పీడీని ఫోన్లో సంప్రదించగా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఈ ఘటన ఆమె వ్యక్తిగతమైందని, దీంట్లో ఎలాంటి రాజకీయం లేదని వ్యాఖ్యానించారు. బాధ్యతగల అధికారిగా బాధితురాలుకి అండగా నిలవాల్సింది పోయి వేధింపులకు పాల్పడిన వారికి వత్తాసు పలికేలా మాట్లాడటంపై విమర్శలు వెల్లువెత్తాయి.


ఓడిసి తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నాలో పాల్గొన్న అంగన్వాడీ కార్యకర్తలు, సిఐటియు నాయకులు


కదిరి ఆసుపత్రిలో బాధితులతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు



ఊరు మధ్యలో ప్రమాదకరంగా బావి..

కంచె వేయాలని స్థానికుల వేడుకోలు

ప్రజాశక్తి-పుట్లూరు

మండల కేంద్రంలోని ఊరి మధ్యలో ఖాళీగా ఓ బావి ప్రమాదకరంగా ఉంది. బావికి అతితక్కువ ఎత్తులో గోడ ఉండటం వల్ల ఏ ప్రమాదం సంభవిస్తుందో.. అని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా వీధిలోని పిల్లలు సాయంత్రం సమయంలో, సెలవు రోజుల్లో ఆడుకుంటూ ఉంటారు. ఆసమయంలో పిల్లలు ప్రమాదానికి గురవుతారో అని భయపడుతున్నారు. ఊరి మధ్యలో బావి ఉండటంతో ఏ ప్రమాదం జరగక ముందే కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రైల్వే ఆసుపత్రికి అంబులెన్స్ ఏర్పాటు చేయాలి

దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-గుత్తి

రైల్వే ఆసుపత్రికి నూతన అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ గుత్తి డీజిల్‌షెడ్ బ్రాంచి కార్యదర్శి రామాంజనేయులురెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం స్థానిక ఆసుపత్రి ముందు దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న అంబులెన్స్ శిథిలావస్థకు చేరుకుందన్నారు. నూతన అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలని గుత్తికి విచ్చేసిన సికింద్రాబాద్ లాలాగూడ సిఎండి డాక్టర్ వెంకటేశ్వరరావుకు విన్నవించామన్నారు. అంతేగాకుండా గుంతకల్లు డిఆర్ఎం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లామన్నారు. అయినా పట్టించుకోలేదన్నారు. దీనివల్ల వందలాదిమంది రైల్వే కార్మికులు, రైల్వే పింఛనుదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇందులో భాగంగానే శుక్రవారం డీజిల్‌షెడ్‌లో జూనియర్ క్లర్క్‌గా పని చేసే పరంధామ గుండె నొప్పి రావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో అనంతపురానికి వైద్యులు రెఫర్ చేశారన్నారు. అంబులెన్స్ లేకపోవడంతో 108 వాహనం ఆలస్యంగా రావడంతో అనంతపురానికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మరణించాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు స్పందించి నూతన అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీంతో స్పందించిన రైల్వే ఆస్పత్రి వైద్యులు విజయలక్ష్మి, వెంకటేశ్వరరావు కలిసి గుంతకల్లు సిఎంఎస్ వేణుగోపాల్‌రెడ్డితో ఫోన్లో సంభాషించారు. టెండర్ ప్రక్రియ త్వరగా పూర్తిచేసి అంబులెన్స్ ను కేటాయిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే గుత్తి డీజిల్ షెడ్ అదనపు కార్యదర్శి నారాయణ, ఛైర్మన్ నరసింహ, నాయకులు శేఖర్ బాబు, మనోహర్, రైల్వే ఎస్సీ, ఎస్టీ కార్మిక సంఘం కార్యదర్శి రామ్‌నాయక్, రైల్వే పెన్షనర్ల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ గుత్తి డీజిల్‌షెడ్ బ్రాంచి కార్యదర్శి రామాంజనేయులురెడ్డి

వారు.. వీరయ్యారు...

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రతిపక్షంలో ఉండగా ప్రజాస్వామిక విలువ గురించి మాట్లాడిన వారేమో అధికారం వస్తూనే మారిపోయారు. నిన్నటి వరకు అంతా తాము చెప్పినట్టే నడుస్తుందని చెప్పిన వారు...ఇప్పుడు ఒకేసారి మాట మార్చి ప్రజా సమస్యలపై మాట్లాడుతున్నారు. అధికారంలోకి వచ్చిన పార్టీ నేతలతేమో తమ అధికార దర్పణాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈ ప్రతాపం ప్రధానంగా ఉద్యోగులపై చూపడం ప్రారంభించారు. ఇక చిరుద్యోగుల గురించి వేరే చెప్పనక్కర్లేదు. ఎన్నో ఏళ్లుగా వృత్తిని నమ్ముకుని పనిచేస్తున్న వారందరినీ బలవంతంగా ఇంటికి పంపించే కార్యక్రమాలు యధేచ్ఛగా జరుగుతున్నాయి. స్కిమ్ వర్కర్లపై ఒత్తిడి అధికంగా ఉంటోంది. ఆశ, అంగన్‌వాడీ, యానిమేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఇలా చిన్నచిన్న పనులు చేసుకునే వారందరినీ ఇంటికి పంపించే పనులు చేపట్టారు. రాజకీయపరమైన ఒత్తిళ్లతో ఇది వరకు వజ్రకరూరు మండలంలో మధ్యాహ్న భోజన కార్మికురాలు ఆత్మహత్యాయత్నం పాల్పడిన ఘటన చోటు చేసుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఇప్పుడు సత్యసాయి జిల్లాలోని ఓడిసి మండలంలో అంగన్‌వవాడీ కార్యకర్త ఒకరు ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన ఘటన చోటు చేసుకుంది. ఇక ఈ బాధలు తట్టుకోలేక తప్పుకున్న వారి సంగతి వేరే చెప్పనక్కర్లేదు. ఎటువంటి తప్పిదాల్లేకున్నా వారిని విధుల నుంచి తొలగించి వేస్తున్నారు. అనంతపురం జిల్లాలో ఇప్పటికే మధ్యాహ్న భోజన కార్మికులు యాభై శాతం మందిని తొలగించి కొత్తవారిని చేర్చడం జరిగింది. ఇక తక్కిన వాటిని చేర్చే ప్రయత్నాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇక ప్రజాప్రతినిధుల బంధువులు మండల స్థాయి అధికారులను సైతం తమ ఆదేశాల్లేకుండా ఏ పని చేయవద్దని హుకుం జారీ చేసిన ఘటనలున్నాయి. ఇక ఒక నియోజకవర్గంలో అయితే పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులైనా, కేసు నమోదులైనా తమకు తెలియజేయకుండా ఎటువంటి చర్యలు తీసుకోవద్దని ఎమ్మెల్యే సమీప బంధువు ఒకరు సర్కిల్ స్థాయి అధికారికి మౌఖిక ఆదేశాలిచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. ఇలా ప్రతిదీ తమ కనుసన్నల్లో నడవాలన్నట్టుగా కొంత మంది నేతల తీరు మారుతుండటం చర్చనీయాంశమైంది. ఇక ఈ వారంలో తాడిపత్రి ఎమ్మెల్యే జెసి.ప్రభాకర్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిపై ఫిర్యాదు చేయడం చర్చనీయాంశమైంది. ఆయనపై మోపిన బిఎస్3 వాహనాల కేసు మాజీ ఎమ్మెల్యే సూచనల మేరకే అధికారులు చేసారు కాబట్టి ఇప్పుడు తానిచ్చిన ఫిర్యాదు మేరకు కూడా ఆయనపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. దీన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీనిచ్చి ఉన్నారు. ఇలా తాడిపత్రి నియోజకవర్గం ఈ వారంలో ప్రధాన అంశంగా మారింది. ఇక ఈ వారంలో ఖరీఫ్ ఆశలు ఆవిరయ్యాయి. సీజన్ ముగుస్తున్నా ఒక పదును వాన పడలేదు. ఇక ఆగస్టులో వర్షాలొచ్చి పంట పెట్టినా పెద్దగా దిగుబడి రాదన్న ఉద్దేశ్యంతో రైతులు సాగుకు సిద్ధపడే పరిస్థితులేవు. ఇక ఖరీఫ్‌పై రైతులు ఆశలు వదిలేసుకునే పరిస్థితులు నెలకొన్నాయి. అయితే తుంగభద్ర పూర్తిగా నీటితో నిండి హెచ్ఎల్‌సికి నీరు రావడం కొంత ఊరటనిచ్చే అంశమని చెప్పాలి. ఆయకట్టు రైతులకైనా నీరందే అవకాశముంది. ఇప్పటికే తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు నీటిని విడుదల చేశారు.



రైతుల సమస్యలు పరిష్కరించాలి

ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-వజ్రకరూరు

రైతాంగ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఉరవకొండ మండలంలోని ఇంద్రావతి గ్రామంలో రైతుసంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించార. ఇందులో భాగంగా రైతులు ఎదుర్కొన్నటు పలు సమస్యలపై చర్చించి చేపట్టాల్సిన విధి విధానాలు, కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ కోతల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా వర్షాలు రాక పంట నష్టపోయిన రైతాంగానికి అన్నిరకాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని, ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 20 రోజుల్లో కార్యాచరణ ప్రకటించి పెద్దఎత్తున ఆందోళనలకు సిద్ధం కానున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు మధుసూదన్, తాలూకా కార్యదర్శులు సీనప్ప, మురళి, రవికుమార్, వీరాంజనేయులు, నాయకులు ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

పెద్దాసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించారు. రాయదుర్గం తాలూకా గుమ్మగట్ట మండలం రంగచేడు గ్రామానికి చెందిన రంగప్ప భార్య నరసక్క ఐదేళ్ల నుంచి కడుపునొప్పితో బాధపడుతూ జిల్లాకేంద్రంలోని అనేక ప్రయివేటు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకుంది. అయినా నయం కాక జిల్లాకేంద్రంలోని సర్వజన ఆస్పత్రిలో శస్త్రచికిత్స వైద్యులు డాక్టర్ రమణానాయక్ పరీక్షించి ఆపరేషన్ చేయాలని చేర్చుకున్నారు. ఆపరేషన్ ముందు దాదాపు రక్తం ఎక్కించి ప్రొఫెసర్ హెచ్ఒడి రామస్వామినాయక్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉజ్జనేశ్వరి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రమణానాయక్ బృందం కలిసి ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేశారు. ఆపరేషన్ అనంతరం దాదాపు 16 బాటిల్స్ రక్తం ఎక్కించి 15 రోజుల తర్వాత రోగిని ఇంటికి పంపారు. ఇందులో భాగంగా దాదాపు మూడు గంటల పాటు శ్రమించి 5కిలోల గడ్డను తొలగించినట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్తుమందు డాక్టర్ హరికృష్ణ, పిజిలు డాక్టర్ రమ్య, డాక్టర్ విషాల్, డాక్టర్ అభిలాష్, స్టాఫ్‌నర్స్ సునీత, తదితరులు పాల్గొన్నారు.


శస్త్ర చికిత్స వివరాలను వెల్లడిస్తున్న వైద్యులు

క్రికెట్ టోర్నీ విజేతలుగా 'శ్రీవాణి, శ్రీచైతన్య' విద్యార్థులు

ప్రజాశక్తి-తాడిపత్రి

తాడిపత్రి జూనియర్ కళాశాల మైదానంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో రసవత్తరంగా సాగిన క్రీడాపోటీల్లో శ్రీవాణి, హౌస్కూల్, శ్రీచైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. శ్రీచైతన్య టెక్నో స్కూల్, శ్రీవాణి పాఠశాలల బాలికల మధ్య సాగిన ఫైనల్ పోటీలో శ్రీ చైతన్య అమ్మాయిలు విజయం సాధించారు. బాలుర విభాగంలో పెద్దపప్పూరు మౌర్య హైస్కూల్, తాడిపత్రి శ్రీవాణి హైస్కూల్ జట్లు ఫైనల్ పోటీలో శ్రీవాణి జట్టుకే విజయం వరించింది. ఈ సందర్భంగా సీనియర్ క్రికెటర్ సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు క్రీడాస్ఫూర్తితో వ్యవహరించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఉత్తమ క్రీడాకారులను తీర్చిదిద్దాలన్నదే ఆర్డీటీ ముఖ్య ఉద్దేశమన్నారు. ఇందులో భాగంగానే ప్రతి సంవత్సరం పోటీలను నిర్వహిస్తున్నట్లు సీనియర్ కోచ్ సాదిక్‌వలి వివరించారు. విజేతలకు ఎటిఎల్ లలిత, కౌన్సిలర్ కొత్తపల్లి మల్లికార్జున, సీనియర్ జర్నలిస్ట్ కన్నా, తదితరులు పాల్గొన్నారు.


టోర్నమెంట్ విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న సుధీర్‌రెడ్డి

మరువ వంక పూడికతీత పనుల పరిశీలన

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా నిరోధించేందుకు చేపట్టిన నగరంలోని మరువవంక పూడికతీత పనులను కమిషనర్ పివివిఎస్.మూర్తి శనివారం పరిశీలించారు. ఇందులో భాగంగా స్థానిక సంఘమేష్ థియేటర్ నుంచి మరువవంకను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం కావున నగరంలోని చిన్న, పెద్ద కాలువల్లో పూడికతీత పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పూడికతీసిన తర్వాత తరలింపులో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ఎప్పటికప్పుడు పూడిక మట్టిని తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సూర్యనారాయణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుభాష్ చంద్రబోస్, తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ మూర్తి

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

ప్రజాశక్తి-ఉరవకొండ

బాల్య వివాహాలను నిర్మూలించి బంగారు భవిష్యత్తుకు పాటలు వేద్దామని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి పిలుపునిచ్చారు. జిల్లా మహిళా సంక్షేమ శాఖ సాధికారిణి అధికారి బి.ఎన్ శ్రీదేవి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి మంజునాథ్ ఆదేశాల మేరకు విడపనకల్ మండల పరిధిలోని గాజుల మాలాపురంలో అంగన్వాడీ సెక్టార్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చేనెలలో పెళ్లి ముహూర్తాలు ఉండటం వల్ల అప్రమత్తంగా ఉండా బాల్య వివాహాలను అడ్డుకోవాలన్నారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్‌కు వివరాలను తెలియజేయాలని సూచించారు. ఈ సమావేశంలో డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ ఔట్రీచ్ వర్కర్ వాల్మీకి రమాదేవి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కల్పన, అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి

కేంద్ర ప్రభుత్వ అవార్డులు అందుకున్న యువకులు



కేంద్ర సహాయ మంత్రి జితిన్ ప్రసాద్ నుంచి అవార్డు అందుకుంటున్న బిసాటి భరత్

ప్రజాశక్తి-అనంతపురం

కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ డిజిటల్ ఇండియా విభాగం మై గవర్నమెంట్ అవార్డులను అనంతపురం యువకులు బిసాటి భరత్, బిసాటి జీవన్‌కుమార్ అందుకున్నారు. ఢిల్లీలోని ఇండియా హాబిటెడ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బిసాటి భరత్‌కు మై గవ్ అంబాసిడర్ అవార్డు, బిసాటి జీవన్‌కుమార్‌కు మై గవ్ సాతి అవార్డును కేంద్ర సహాయ మంత్రి జితిన్ ప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా బిసాటి భరత్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలల్లో యువతకు మై గవ్ గురించి తెలియజేసే మై గవర్నమెంట్ అంబాసిడర్‌గా చేర్చేందుకు కృషి చేస్తానన్నారు.

అబ్దుల్‌కలాం జీవితం ఆదర్శప్రాయం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

దివంగత మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త ఎపిజె అబ్దుల్ కలాం జీవితం అందరికీ ఆదర్శప్రాయమని పలువురు వక్తలు కొనియాడారు. అబ్దుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకుని శనివారం స్థానిక కార్పొరేషన్‌లోని మేయర్ ఛాంబర్‌లో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అబ్దుల్ కలాం ఎంతటి ఉన్నత స్థానాలకు ఎదిగినా ఒదిగి ఉండాలనే మనస్తత్వం కలిగిన వారు అన్నారు. ఆయన నిరాడంబర జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకమన్నారు. భావిపౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఆయన ఎనలేని కృషిని సంకల్పించారన్నారు. అతి పేద కుటుంబం నుంచి వచ్చి ఉన్నత విద్యను అభ్యసించి దేశం గర్వించే శాస్త్రవేత్తగా ఎదిగారన్నారు. అంతేకాక అందరి ఆమోదంతో రాష్ట్రపతి పదవిని అధిరోహించి పదవికే వన్నె తెచ్చిన మహనీయుడు అన్నారు. వివాద రహితుడుగా నిరాడంబర జీవితం గడుపుతూ కలుపుగోలు మనస్తత్వం కలిగిన అబ్దుల్ కలాం జీవితం అందరికీ ఆదర్శప్రాయమని కొనియాడారు. ఈ సమావేశంలో మేయర్ మహమ్మద్ వసీం, కమిషనర్ పివివిఎస్.మూర్తి, డిప్యూటీ మేయర్లు విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి, కార్యదర్శి సంఘం శ్రీనివాసులు, అదనపు కమిషనర్ హరిబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సూర్యనారాయణ, సుధారాణి, అధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.


అబ్దుల్ కలాంకు నివాళులర్పిస్తున్న నాయకులు, అధికారులు

టిడిపి విజయంలో 'మదమంచి' కీలకపాత్ర

పార్టీలో చురుగ్గా పని చేస్తున్న ప్రతాప్‌చౌదరి కుటుంబం

ప్రజాశక్తి-నార్పల


మదమంచి ప్రతాప్‌చౌదరి

1983లో నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించినప్పటి నుంచి నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎవరు నిలబడినా గెలిపించడంతో విశ్రాంత ఉపాధ్యాయుడు మదమంచి గంగప్ప కుటుంబం కీలకంగా పని చేస్తోంది. పార్టీ ఏర్పడి 40ఏళ్లు పూర్తవుతున్నా.. పార్టీనే నమ్ముకుని ఎమ్మెల్యే నుంచి సర్పంచి అభ్యర్థుల వరకూ విజయంలో మదమంచి కుటుంబం కీలకపాత్ర పోషిస్తూ ఉంటుంది. అధిష్టానం అభ్యర్థిగా ఎవరిని నిర్ధారిస్తే వారి నిర్ణయమే శిరోధార్యంగా భావించి మదమంచి విధేయతతో పని చేస్తోంది. పార్టీ అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. వెరవకుండా నాయకులతోపాటు కార్యకర్తలకు అండగా ఉంటూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ ఉంటారు. అయితే కుటుంబ మొత్తం పార్టీ కోసం కష్టపడి పని చేస్తున్నా ఇంత వరకూ కనీసం ఒక్క నామినేటెడ్ పదవి కూడా ఇవ్వకపోవడం పట్ల కార్యకర్తలు, ఆయన అభిమానులు నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగానే 25 ఏళ్లుగా మదమంచి కుటుంబానికి చెందిన ప్రతాప్‌చౌదరి నార్పల మండలంలో టిడిపి అభ్యున్నతికి నిస్వార్థంగా పని చేస్తున్నారు. గతంలో ప్రతాప్‌చౌదరికి మండల కన్వీనర్ పదవి వచ్చినట్లే వచ్చి ఆఖరి నిమిషంలో రాకుండా పోయింది. అయినా ఆయన ఏమాత్రం నిరుత్సాహ పడకుండా పని చేస్తూనే ఉన్నారు. పార్టీ ఎమ్మెల్యేలు కొత్తపల్లి జయరామ్ నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ వరకూ వారి విజయాల్లో కీలకపాత్ర పోషించారు. చిత్తశుద్ధి కలిగి పార్టీ స్థాపించినప్పటి నుంచి మండలంలో ఇంతవరకూ ఏ పదవీ ఆశించకుండా నిస్వార్థగా కష్టపడి పని చేసిన మదమంచి కుటుంబాన్ని అధిష్టానం గుర్తించాలని మండల నాయకులు, కార్యకర్తలు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులను నివారించాలి

కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ హరికిరణ్

ప్రజాశక్తి-అనంతపురం అర్బన్

వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జిల్లాస్థాయిలో చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ హరికిరణ్ సూచించారు. శనివారం రాష్ట్రస్థాయిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ప్రోగ్రాం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ అందిస్తున్న సేవలకు సంబంధించి పలు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెనింగ్‌ను జిల్లా, ప్రోగ్రాం అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 24 /7 వైద్యసేవలు అందించాలన్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో తప్పనిసరిగా గర్భిణులకు ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఇబి.దేవి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సుజాత, డాక్టర్ యుగంధర్, డాక్టర్ అనుపమ జేమ్స్, డాక్టర్ నారాయణస్వామి, మలేరియా అధికారి ఓబులు, స్టాటిస్టికల్ అధికారి మహమ్మద్ రఫీ, డెమో త్యాగరాజు, గంగాధర్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

నగరంలోని వినాయక నగర్‌లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిఎంహెచ్ఒ ఇబి.దేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఓపీ సేవలు, ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులు, అన్నిరకాల వైద్యసేవల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే వైద్య అధికారి, సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డిఎంహెచ్ఒ ఇబి.దేవి, అధికారులు

గుండెపోటుకు 'సిపిఆర్' రక్షణ

అనంతపురం అర్బన్ : ప్రాణాంతకంగా మారిన గుండెపోటుకు సిపిఆర్ విధానంతో తక్షణ రక్షణ లభిస్తుందని పెద్దాసుపత్రి ఆర్ఎంఒ డాక్టర్ గుజ్జుల హేమలత సూచించారు. శనివారం పెద్దాసుపత్రిలో సిపిఆర్ విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా గుండెపోటుకు గురైన వ్యక్తికి వెంటనే సిపిఆర్ చేయడం ద్వారా ప్రాణాపాయం నుంచి ఎలా రక్షించవచ్చో ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎం.ఓ డాక్టర్ పద్మజ, ఎనస్థీషియా ప్రొఫెసర్ నవీన్ కుమార్, ఎమర్జెన్సీ మెడికల్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నూరుల్లా ఖాన్, డాక్టర్ సునీత, హౌస్ సర్జన్లు, నర్సింగ్ సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్లు, సెక్యూరిటీ, అన్ని విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.


సిపిఆర్ విధానంపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు


మొక్కలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మొక్కల ప్రాధాన్యతపై అవగాహన

పుట్లూరు : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం విజయలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం 'మొక్కల ప్రాధాన్యత – పరిరక్షణ' అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఎంఇఒలు శ్రీదేవి, ప్రేమ్‌కుమార్, ఉపాధ్యాయులు కలిసి మొక్కలు నాటారు.

విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రం కొనసాగింపు

గుత్తి : విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రం యథావిధిగా కొనసాగుతుందని ఏపీ ఎస్పీ డీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.రాజశేఖర్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం ఆదివారం రోజు కూడా విద్యుత్తు బిల్లుల వసూలు కేంద్రాన్ని కొనసాగిస్తున్నామని చెప్పారు. వినియోగదారులు విద్యుత్ బిల్లులను చెల్లించి విద్యుత్ శాఖకు సహకరించాలని ఆయన కోరారు.

చట్టాలపై అవగాహన అవసరం

పెద్దపప్పూరు : చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఎస్ఐ గౌస్‌బాషా సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాల గురించి తెలుసుకోవడం వల్ల న్యాయం జరుగుతుందన్నారు. అలాగే వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

పుట్లూరు : ప్రజలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ హేమాద్రి సూచించారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

ఎపి విద్యార్థి జెఏసి జిల్లా అధ్యక్షుడిగా అమర్‌యాదవ్

అనంతపురం : ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్స్ జెఏసి జిల్లా అధ్యక్షుడిగా అమర్‌యాదవ్‌ను నియమించారు. ఈయనతోపాటు జిల్లా ఉపాధ్యక్షులుగా అభిరామ్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాజేష్, జిల్లా కార్యదర్శులుగా ఎం.విజయయాదవ్, పార్థసారథిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు హేమాద్రి యాదవ్ ఉత్తర్వులు జారీ చేశారు.

మొహర్రం వేడుకల్లో టిడిపి నాయకులు

అనంతపురం : నగరంలోని 10వ డివిజన్‌లో జరిగిన మొహరం వేడుకల్లో టిడిపి నాయకులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రార్థనలు చేసిన వారిలో టిడిపి నాయకులు పోతుల లక్ష్మీనరసింహులు, పోతుల మంజునాథ్, ముబారక్, బాషా, విజయ్, మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె తహశీల్దార్ బదిలీ


బదిలీ తహశీల్దార్‌తో సిబ్బంది

గార్లదిన్నె : స్థానిక తహశీల్దార్ లోకేశ్వరి శనివారం తన సొంత జిల్లా చిత్తూరుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా స్థానిక కార్యాలయంలో కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

పకడ్బందీగా పింఛన్ల పంపిణీ


మాట్లాడుతున్న ఎంపిడిఒ సుబ్బరాజు

వజ్రకరూరు : ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీని పకడ్బందీగా చేపట్టాలని ఉరవకొండ ఎంపిడిఒ సుబ్బరాజు సూచించారు. శనివారం ఉరవకొండ ఎంపిడిఒ ఛాంబర్‌లో వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లతో పింఛన్ల పంపిణీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ స్కీమ్‌పై ప్రభుత్వం నుంచి జారీ అయిన తాజా మార్గదర్శకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌అండ్‌ఆర్‌డి చంద్రమౌళి, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు శంకరయ్య, శిల్ప, తిప్పేస్వామి, భార్గవి, సాయికృష్ణ, సాయిరాం, బి.సాయిరామ్‌నాయక్, అహ్మద్, దుర్గాప్రసాద్, జనార్ధన్, విశ్వనాథ్, మల్లికార్జున, శంకరయ్య, హరికృష్ణ, అనిల్‌కుమార్, సునీత, పవన్‌కుమారి, కంప్యూటర్ ఆపరేటర్ ప్రకాష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి

వజ్రకరూరు : శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ హాస్టళ్ల స్థానంలో నూతన భవనాలను నిర్మించడంతోపాటు పెండింగ్‌లో ఉన్న మెస్‌బిల్లులు, కాస్మొటిక్ ఛార్జీలను విడుదల చేయాలని ఎఐఎస్ఎఫ్ ఉరవకొండ మండల అధ్యక్షులు హారన్‌రషీద్ డిమాండ్ చేశారు. హాస్టళ్లలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం ఉరవకొండలోని హాస్టళ్ల సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉరవకొండలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులను సమస్యలు తెలుసుకున్నారు. నూతనంగా ఏర్పడిన ఎన్‌డిఎ ప్రభుత్వం వెంటనే హాస్టళ్లలోని సమస్యలను గుర్తించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆగస్టు 6న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు విష్ణువర్ధన్, నవీన్ కుమార్, సురేష్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ఎం ఫార్మసీ ఫలితాలు విడుదల

అనంతపురం : స్థానిక జెఎన్‌టియు పరిధిలో నిర్వహించిన ఎం.ఫార్మసీ 4వ సెమిస్టర్ (ఆర్21) రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎం.ఫార్మసీ 4వ సెమిస్టర్ (ఆర్17) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను శనివారం విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎక్సామినేషన్ బి.చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. పరీక్ష ఫలితాల కోసం జెఎన్‌టియు వెబ్‌సైట్ www.jntua.ac.inను సంప్రదించాలని కోరారు.

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం


అన్నదానం చేస్తున్న నిత్యసురభి ట్రస్టు సభ్యులు

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు 'పుట్టినిల్లు' ఆశ్రమం ఆధ్వర్యంలో నగరంలోని పెద్దాసుపత్రి వద్ద శనివారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి మాట్లాడుతూ ట్రస్టు సభ్యులు, ప్రవాస భారతీయులు రవీంద్రనాథ్ కల్లమాడి సతీమణి రమాదేవి పుట్టిన సందర్భంగా అన్నదానానికి సహకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సుబ్రమణ్యం, ఓబుళపతి, కిష్టప్ప, నల్లప్ప, జగన్నాథ్, మణిదీప్, లక్ష్మీనారాయణ, పుష్ప, నవ్యశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత గుండె వైద్యశిబిరం


వైద్యశిబిరంలో పాల్గొన్న టిడిపి నేతలు

శింగనమల : ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశాల మేరకు శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచిత గుండె వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వి మార్క్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బోయ సత్తి, బండి వెంకట్ నారాయణ, నాగమణి, ముత్తువల్లి, కాయగూరల సత్తి, ముంత వెంకటేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధార్‌కేంద్రాల తనిఖీ


ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ సుబ్బరాజు

వజ్రకరూరు : ఉరవకొండ మండలంలోని గ్రామ సచివాలయం-2లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఎంపిడిఒ సుబ్బరాజు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆధార్ నమోదు, మార్పులు, చేర్పుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి పిఆర్ అండ్ ఆర్‌డి చంద్రమౌళి, కార్యాలయ పరిపాలనాధికారి జయరాములు, పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్, డిజిటల్ అసిస్టెంట్ నూర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టుశిక్షణ కేంద్రం ప్రారంభం


కుట్టు శిక్షణను పరిశీలిస్తున్న అధికారులు

గుంతకల్లు : పట్టణంలోని సత్యనారాయణ పేటలో మహిళా శిశు సంక్షేమ ఆధ్వర్యంలో జన శిక్షణ సంస్థాన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆర్‌డిఒ శ్రీనివాసులురెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహిళలు ఆర్థిక స్వావలంబన పొందాలన్న ఉద్దేశంతో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుత్తి ప్రాజెక్టు సిడిపిఒ ఎన్.ఢిల్లీశ్వరి, జన శిక్షణ సంస్థాన్ టిఒ రషీద్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు బి.శ్రీదేవి, డి.కృష్ణవేణి, పుష్పలత, నాగేశ్వరి, గుత్తి ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.


తూతూమంత్రంగా మండల సమావేశం

ఆత్మకూరు : ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా అరగంటలోనే ముగించడం విశేషం. ఎలాంటి ప్రజా సమస్యలు చర్చకు రాకుండానే సమావేశం మొక్కుబడిగా సాగడం పట్ల పలువురు ఆశ్చర్యపోతున్నారు. సమావేశానికి 14 మంది సర్పంచులు, ఏడుగురు ఎంపిటిసిలు హాజరయ్యారు. సమావేశం ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా, గంటన్నర ఆలస్యంగా ప్రారంభమై కేవలం 25-30 నిమిషాలకు ముగించడం బాధాకరం. తద్వారా ప్రజా సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని స్థానికులు వాపోతున్నారు.

టిడిపి నాయకుడి మృతికి నివాళి

బ్రహ్మసముద్రం : మండల కేంద్రానికి చెందిన తలారి చంద్రశేఖర్ (75) మృతికి పలువురు నాయకులు శనివారం నివాళులర్పించారు. చంద్రశేఖర్ అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టిడిపి మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, జడ్పిటిసి ప్రభావతమ్మ, సీనియర్ నాయకులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఉపసర్పంచ్ పరమేష్, పిఎసిఎస్ ఉద్యోగి ఈశ్వర్, నాయకులు శివారెడ్డి, మోహన్, వడ్డే వెంకటేష్, తదితరులు ఉన్నారు.

ఘనంగా సయ్యద్‌బాబా సర్దార్‌వలి స్వామి ఉత్సవం


స్వామివారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

అనంతపురం : స్థానిక కళ్యాణదుర్గం రోడ్డులోని సయ్యద్ బాబా సర్దార్‌వలి స్వామి ఉత్సవం ఘనంగా జరిగింది. మొహరం వేడుకల్లో భాగంగా సయ్యద్‌బాబా సర్దార్‌వలి స్వామివార్లను 10వ రోజుల ఏర్పాటు చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. 10వ రోజు జల్దిని పురస్కరించుకుని భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున, షేక్ సర్దార్‌వలి, బాషా, రాము, రమణ, సంతోష్, జావీద్, అలీ, జాఫర్, వీరన్న, రామాంజి, చల్లా, కుమార్, అర్జున్, అనిల్, ఎర్రిస్వామి, నారాయణస్వామి, విజయ్, శివ, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

నార్పల : మండల కేంద్రంలోని శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలోని పెట్రోల్ బంకు వద్ద ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొనడంతో మండలంలోని పులుసలనూతల గ్రామానికి చెందిన రాజన్న కుమారుడు రాజ్‌కుమార్(28) తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.

లైంగిక వేధింపుల కేసులో నిందితుడికి రిమాండ్

గార్లదిన్నె : మండల కేంద్రంలోని క్రిస్టియన్ ట్రస్టు నిర్వాహకుడు సాదిక్‌వలి కుమారుడు నూరుబాషాను లైంగిక వేధింపుల కేసులో శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు అనంతపురం డీఎస్పీ వెంకటశివారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిందితుడు నూర్‌బాషాను మండల కేంద్రంలోని శింగనమల క్లాస్ వద్ద అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకోవడంలో శింగనమల ఎస్ఐ చంద్రశేఖర్, గార్లదిన్నె పోలీసులు తోడ్పడినట్లు తెలిపారు.